కథ



# హక్కు

డి.ఆర్.ఇంద్ర

**పాదుషాల రాచరికపు అహంకారానికి చెంపపెట్టు రూపమతి సౌందర్య విలాసం! మరణించాక కూడా చక్రవర్తికి గర్వభంగం కలిగించడం రూపమతి విలక్షణ స్వభావం. అపూర్వమయిన చారిత్రక గాథను అద్భుతమైన కథనంతో ఆవిష్కరించడం రచయిత ప్రతిభకు నిదర్శనం!!**

*"ఒక్కసారి ఆమె నేత్రాలను చూసిన వారెవరూ ఇక కలువపువ్వులను చూడరట జహాపనా!*

*ఆమె గొంతు ఒక్కసారి వింటే సిగ్గుతో కోయిలలు మూగనోము పడతాయట!*

*ఆమె ఆటను చూసి నెమళ్ళు నిర్ఘాంతపోయి పించాలు ముడుచుకుంటాయట!*

*గాలిలో తేలివచ్చే ఆమె అపురూప దేహ పరిమళాలను ఆస్వాదించి చిన్నబోయిన సన్నజాజులూ, సంపెంగలూ ఇక తాము పరిమళించడం విరమిస్తాయట!*

*ఆమె కాళ్ళగజ్జెల ఘల్లుఘల్లు శబ్దాలు ఒక్కసారి వింటే గుండె లయ తప్పుతుందట!*

*ఆమె అపురూప లావణ్యం గురించీ, గాన, నాట్యావధానాల గురించీ కవులు కవిత్వాలు రాస్తారట! ప్రజలు పాటలు కట్టి పాడతారట! ఆమెకు సాటివచ్చే స్త్రీ హిందుస్తాన్‌లోనేకాక లోకంలోనే వుండదట!*

*ఒక లక్ష సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే బ్రహ్మదేవుడు అటువంటి అపూర్వ స్త్రీని సృష్టిస్తాడట జహాపనా!"*

** ** **

ఆగకుండా విన్నవిస్తున్న గూఢచారి ఊపిరి తీసుకోవడానికి ఒక్కక్షణం ఆగాడు.

ఇరవైరెండేళ్ళ అక్బర్ పట్టుబాలీసాకు జార్లబడి తల పంకించాడు.

"ఎవరా అపూర్వ స్త్రీ రత్నం? ఎక్కడవుంది? ఎవరి ఒద్దికలోవుంది?"

గూఢచారి వినయంగా వివరాలు విన్నవించాడు.

ఆమె నామధేయం రూపమతి. రూపానికి తగిన పేరు. ఘనకీర్తిగల విక్రమాదిత్య చక్రవర్తీ, భోజమహారాజుల వంటి ఉద్దండులేలిన మాళ్వదేశ సుల్తాన్ బాజ్‌బహదూర్‌కి పంచప్రాణాలుగా వుంటున్న ప్రేయసి!

బాజ్‌బహదూర్ గొప్ప రసిక చక్రవర్తేగాక సంగీత సాహిత్యాలను ఔపోసన పట్టిన దిట్ట! అతని తల్లి ఢిల్లీ నేలిన సుల్తాన్ మహమద్ ఖాల్జీ వంశానికి చెందిన గొప్ప సంగీత విద్వాంసురాలు. తల్లి సంగీత వైశిష్ట్యాన్ని బాజ్‌బహదూర్ ఉగ్గుపాలతోనే పుణికి పుచ్చుకున్నాడు. ఉత్తర హిందుస్తాన్ అంతటా సంగీతానికి గొప్ప వస్తాదుగా పేరొందిన మహమద్‌షా ఆదిల్‌కి ప్రియశిష్యుడేగాక, మరొకసాటిలేని గాయకుడు తాన్‌సేన్‌కి సహాధ్యాయి కూడా. గాత్రంలోనేకాక తబలా వంటి వాయిద్యాలలో కూడా అద్భుత నైపుణ్యంగల నిపుణుడు. అతను స్వయంగా రాసి, స్వరపరచి పాడే ప్రేమగీతాలను మాళ్వలోనేగాక ఉత్తర హిందుస్తానమంతటా ప్రేమికులైన యువతీ యువకులు నిత్యం పాడుతూనే వుంటారు.

*బాజ్ బహదూర్ పాట! ఆ పాటకు రూపమతి నాట్యం!*

*ఆ పాట వినడానికి రెండు చెవులూ సరిపోవు!*

*ఆ నాట్యం చూడటానికి రెండు నేత్రాలూ సరిపోవు!*

*ఆ ఆనందాన్ని అనుభవించడానికి ఒక్క హృదయం, ఒక్క జన్మ సరిపోవు!*

హిందుస్తాన్‌లోని సంగీత సాహిత్య నాట్యాభిమానులు మాళ్వ దర్బార్‌ను సందర్శించడం జన్మసాఫల్యంగా భావిస్తారట!"

"...గూఢచారీ, ఆపు!"

వినేకొద్దీ అక్బర్ కళ్ళు ఎరుపెక్కాయి. ఆగ్రహంతో పెదవులదిరాయి.

ఆమె ఎవరైతేనేం, ఎక్కడిదైతేనేం?

ఆమె గానం తన స్వంతం కావాలి! తనకోసం ఆమె గానించాలి!

ఆమె నాట్యం తన స్వంతం కావాలి! ఆమె తన ఎదుట నర్తించాలి!

ఆమె అపురూప దేహ పరిమళాలూ, తనూలావణ్య సోయగాలూ తన అనుభవానికి స్వంతం కావాలి!

ఆమె మొత్తంగా తనొక్కడికే స్వంతం కావాలి!

తను చక్రవర్తి!

హిందుస్తాన్‌కి మొగల్ పాదుషా!

లోకంలో అపూర్వమైనవన్నీ- ప్రాణం వున్నవీ, లేనివీ కూడా చక్రవర్తికే చెందాలి. అవి చక్రవర్తి ఆనందానికీ, అనుభవానికీ మాత్రమే పరిమితం కావాలి. చక్రవర్తి చేత అనుభవింపబడటంకన్నా అపూర్వ సౌందర్యానికి సార్థకత ఏముంటుంది?

వజ్రాలు భూగర్భంలో ఎక్కడో నిలువు లోతులో వున్నా, తవ్వి పెకలించబడి, సానపెట్టబడి చక్రవర్తి కిరీటాన్ని చేరి సార్థకత చెందినట్టు లోకంలోని అపూర్వ సౌందర్య రాశులైన స్త్రీలకు చక్రవర్తి అంతఃపురం కన్నా సరైన స్థానం ఎక్కడ వుంటుంది? సౌందర్యం ఎక్కడ వున్నా స్వంతం చేసు కోవడం చక్రవర్తుల హక్కు. ఆ హక్కును కాదన్నవారి తలలు నేలదొర్లాలి. భగవంతుడి అపూర్వ కళాసృష్టకి పరా కాష్టగా సృష్టించబడ్డ స్త్రీ సౌందర్యం, యవ్వనం భగవంతుడి అంశతో పుట్టిన చక్రవర్తికి చెందడమే సమంజసం. చక్రవర్తి వాంఛను తీర్చడానికి నిరాకరించే ఆడది దైవధిక్కారానికి పాల్పడినట్లే!

తను లోకంలోకెల్లా గొప్పదైన తైమూర్ వంశస్తుడు. తైమూర్ పాలకుల ఆచారం ప్రకారం పాలకుడు మనసుపడ్డ స్త్రీ సాధారణ పౌరుడి భార్య అయినా- అసాధారణ సామంత ప్రభువు భార్యో, కూతురో, చెల్లెలో, కోడలో అయినాసరే ఆ స్త్రీని స్వంతం చేసుకునే హక్కు చక్రవర్తికి వుంది. తైమూర్ పాలకుడి కన్ను ఏ అందగత్తెపై పడిందో ఆ అందగత్తె తన భర్తకు విడాకులిచ్చి ఆ పాలకుడి శయ్యామందిరం చేరి తనని తాను సమర్పించుకోవాలి. అలా జరగని పక్షంలో ఆ అందగత్తె కుటుంబ సభ్యులందరూ శిరచ్ఛేద శిక్షకు పాత్రులవుతారు. తైమూర్ పాలకుడి వాంఛను తృప్తిపరచి స్వగృహం చేరిన ఆ స్త్రీని తిరిగి స్వీకరిం



2

చదానికి ఆమె భర్త నిరాకరిస్తే అతను చిత్రవధల పాలవుతాడు. చక్రవర్తిని ఆనందింపచేసే మహదావకాశాన్ని పొందినందుకు ఆమె భర్త సంతోషించాలి. చక్రవర్తి హక్కుని విమర్శించడమూ ప్రాణాపాయమే. మధురలో హిందువుల చేతా, మహమ్మదీయుల చేత కూడా మర్యాదస్తుడైన పెద్దమనిషిగా గౌరవింపబడే షేక్ ఒబైదుల్లా చక్రవర్తి పద్ధతులను అసాంఘికచర్యలని బహిరంగంగా విమర్శించినందుకు అతనికేగతి పట్టింది?

షేక్ ఒబైదుల్లా చక్రవర్తిని విమర్శించిన మూడవరోజు తెల్లవారుజామున యాభైమంది ఖడ్గధారులైన యమకింకరుల్లాటి సైనికులతో మొగల్ ఫౌజుదారు ఒబైదుల్లా ఇంటి తలుపు తట్టాడు. పిటపిటలాడే పడుచు భార్య బిగి కౌగిట్లో నగ్నంగా సుఖిస్తున్న ఒబైదుల్లా లేచి తలుపు తీసాడు. తళతళా మెరుస్తున్న కృపాణాలను చేతబట్టి ఇంటిని చుట్టుముట్టిన మొగల్ సైనిక దళాన్ని చూడగానే ఆ పెద్ద మనిషి కళ్ళు బైర్లు కమ్మాయి. తను చక్రవర్తి తైమూర్ వంశపు హక్కుని విమర్శించినందుకు ఏం జరగబోతోందో తెలిసిపోయింది. బతికివుంటే బలుసాకు తిని బతకొచ్చు. ప్రాణాలతోవుంటే ఇంతకన్నా ఘనమైన పిరుదులున్న పడుచు భార్యను సంపాదించుకోవచ్చు అనుకుంటూ వణికిపోతూ అక్కడికక్కడే ఫౌజిదార్ ఎదుటనే పడుచు భార్యకు విడాకులిచ్చి భయంతో మధుర వదిలి పారిపోయాడు. పల్లకీలో ఆగ్రాలోని తన అంతఃపురం చేరిన ఆ షేక్ ఒబైదుల్లా పడుచు భార్య సకీనాను రెండు పగళ్ళూ, రెండు రాత్రులూ అదే పనిగా అనుభవిస్తూ శయ్యామందిరం వీడి తను బయటకే రాలేదు. ఆ తర్వాత మరెప్పుడైనా ఎవరైనా తన చక్రవర్తి హక్కుని ప్రశ్నించగలిగారా?

తన తండ్రి హుమయూన్‌కు కుడి భుజంలాటి, తనకూ తండ్రివంటి తన బాల్య సంరక్షకుడైన బైరాంఖాన్ కుటుంబంతో మక్కాకు వెడుతూ మార్గమధ్యంలో హత్యకు గురైతే అతని పడుచు భార్య సలీమా సుల్తానాను తను స్వంతం చేసుకున్నాడు. తననెవరైనా విమర్శించగలిగారా? హిందుస్తాన్‌లో ఏ ప్రాంతాలలో ఎక్కడ ఎటువంటి గొప్ప నాట్యగత్తెలూ, గాయనీమణులున్నా వారు మొగల్ చక్రవర్తిని ఆనందింపచేయడానికి మొగల్ దర్బారు చేరవల్సిందే.

మొగల్ పాదుషా అయిన తనకీ తను మనసుపడ్డ రూపమతికీ మధ్య ఈ బాజ్‌బహదూర్ ఎవడు? గులాబీలాటి రూపమతిని కైవసం చేసుకోడానికి కంటకంలా నిల్చిన ఈ బాజ్ బహదూర్‌ని ఎలా తృంచివేయాలి?

బాజ్‌బహదూర్ తనకి సామంతుడు కాదు. అయితేనేం, తన తాత బాబర్ ఓడించిన ఢిల్లీ సుల్తాన్ ఇబ్రహీం లోడికి మాళ్వ సుల్తాన్లు సామంతులే. ఆ ప్రకారం ఢిల్లీ సుల్తాన్ల సామంతులందరూ మొగల్ సామంతులుగానే తను పరిగణిస్తాడు. అక్బర్ తలచిందే తడవుగా మాళ్వలోని బాజ్ బహదూర్‌కి మొగల్ ఆజ్ఞాపత్రం అందింది. మాళ్వలో బాజ్‌బహదూర్ పాలనలో స్త్రీలకు రక్షణలేదనీ, అరాచకత్వం రాజ్యమేలుతుందనీ, దీనిని ప్రథమ తప్పిదంగా క్షమించి వదులుతున్నామనీ, అందుకు ప్రతిగా బాజ్‌బహదూర్ రూపమతిని మొగల్ పాదుషాకు కానుకగా సమర్పించుకుని క్షమాభిక్ష పొందాలనీ ఆ లేఖ సారాంశం.

బాజ్‌బహదూర్ ఆగ్రహంతో ఆ లేఖను దర్బారులో చించివేసాడు. తన ప్రేయసి రూపమతిపై అక్బర్‌కి హక్కేమిటి? అక్బర్ పట్టపురాణిని తను కోరితే అక్బర్ అంగీకరిస్తాడా? రూపమతి తనొకడికే స్వంతం. తను విలాసపురుషుడే అయినా పిరికివాడు కాదు. తన ఖడ్గమే అక్బర్‌కు సమాధానం చెపుతుంది. అక్బర్‌కు కావల్సిందీ బాజ్‌బహదూర్ ధిక్కారమే. ఆ వంక చాలు మాళ్వపై దండెత్తడానికి. బాజ్ బహదూర్‌ని ఓడించి, రూపమతిని కైవసం చేసుకుని ఆగ్రా చేర్చడానికి మొగల్ సేనానులు పీర్ మహమద్‌ఖాన్, ఆదంఖాన్‌లతో పెద్ద సైన్యం గుజరాత్ బయలుదేరింది.

ఆదంఖాన్ అక్బర్‌కు చిన్నతనంలో పాలిచ్చి సాకిన దాది. మేహమ్ అనాగ కొడుకు. ఆమె మీద గౌరవంతో అక్బర్ ఆమె కొడుకు ఆదంఖాన్‌కు సైన్యాధికారి పదవినిచ్చాడు.

యుద్ధంలో తనకు ఓటమేగనుక సంభవిస్తే మాళ్వ అంతఃపుర సుందరీమణులు మొగల్ ముష్కరుల చేత చిక్క కుండా, ఆ స్త్రీలను సంహరించి వారి మానమర్యాదలను కాపాడేందుకు నమ్మకస్తుడైన దళాధిపతికి అంతఃపుర రక్షణ బాధ్యత అప్పగించి బాజ్‌బహదూర్ యుద్ధ సన్నిద్ధుడయ్యాడు.

** ** **

అపారమైన మొగల్ బలాధిక్యతముందు మాళ్వ బలాలు నిలువలేకపోయాయి. బాజ్‌బహదూర్ గొప్పవీరత్వం ప్రదర్శించినా లాభంలేకపోయింది. ప్రాణాలు దక్కించుకోడానికి కొద్దిమంది అనుచరులతో అడవులలోకి పారిపోయాడు.

మాళ్వ రాజధాని సారంగపూర్ మొగలుల వశమైంది.

కోటలో బాజ్‌బహదూర్ అంతఃపుర స్త్రీల మానరక్షణకు కాపలాగా నియమించబడ్డ దళాధిపతికి మాళ్వ ఓటమి గురించి వార్త అందింది. ఆ స్త్రీల మాన మర్యాదలను కాపాడటానికి ఆ అబలల శిరచ్ఛేదం ఒక్కటే కర్తవ్యం. తప్పదు! వృద్ధ స్త్రీలూ, బాలికలంటూ విచక్షణ లేకుండా అంతఃపుర స్త్రీలనందరినీ తన ఖడ్గానికి బలి ఇచ్చాడు.

*తన ప్రేయసి రూపమతిపై అక్బర్‌కి హక్కేమిటి? అక్బర్ పట్టపురాణిని తను కోరితే అక్బర్ అంగీకరిస్తాడా? రూపమతి తనొకడికే స్వంతం. తను విలాసపురుషుడే అయినా పిరికివాడు కాదు. తన ఖడ్గమే అక్బర్‌కు సమాధానం చెపుతుంది. అక్బర్‌కు కావల్సిందీ బాజ్‌బహదూర్ ధిక్కారమే. ఆ వంక చాలు మాళ్వపై దండెత్తడానికి.*

ఒక్క స్త్రీ కంటివెంటా ఒక్క చుక్క కన్నీరూ లేదు! ఓ మూలుగూ లేదు! రోదనా లేదు! పారిపోయే ప్రయత్నమూ లేదు!

ఒక్కటే వేటు! స్త్రీల శీలాన్ని కాపాడటం ఎంత సులువు!

మూడువందల అబలల శిరస్సులను అవలీలగా, నిర్దయగా ఖండించిన ఆ దళాధిపతికి తన సుల్తాన్ బాజ్ బహదూర్‌కి పంచప్రాణాలైన రూపమతి మెడమీద ఖడ్గపు వేటు పడే సమయంలో మాత్రం అతని చేతులు కంపించాయి.

ఈ అపూర్వ స్త్రీ రత్నం కూడా ఈ ఇద్దరి పాలకుల హక్కుల పోరాటంలో బలికాక తప్పదా?

*తను ఖండిస్తున్నది ఓ దేహాన్ని కాదు.*

*తను హతమారుస్తున్నది నాట్యాన్ని!*

*తను వధిస్తున్నది వృక్షాలను సైతం చిగురింపచేసే గానాన్ని!*

*తను నిర్దయగా సంహరిస్తున్నది సంగీత సాహిత్య గాన రసాధిదేవతని!*

అయినా తన ప్రభువాజ్ఞను తను పాటించక తప్పదు. కళ్ళు మూసుకుని వణుకుతున్న హస్తాలతో ఖడ్గాన్ని ఎత్తాడు. ఫలితంగా గురితప్పి విపరీతమైన రక్తస్రావంతో రూపమతి స్పృహ కోల్పోయింది.

ఆమెను చాటుగా బతికించడానికి ఆమె దాసీలు చేసిన ప్రయత్నాలను రూపమతి నిరసించింది. తనను వేరుగా దహన పరచి తన చితాభస్మాన్ని తన మందిరంలో భద్ర పరచమంది. ఆమె దాసీలు ఆమె కోరిక నెరవేర్చి చివరగా తామూ చితిపై దూకారు. మొగల్ సేనలు అట్టహాసంగా కోటలో ప్రవేశించాయి. ఆశించిన అంతఃపుర సుందరీమణులు చేజిక్కకపోవడంతో ఆదంఖాన్ సారం గపూర్ పట్టణాన్ని నిలువు దోపిడీచేసి చేజిక్కిన స్త్రీలపై అత్యాచారాలు చేసాడు. ఎదిరించిన వారిని సజీవ దహనం చేయించాడు. ప్రాణాలు కోల్పోవడానికి వెరచి అంతఃపురంలో రహస్య స్థలాలలో దాగిన పరిచారికలనూ, నాట్యకత్తెలనూ ఆదంఖాన్, పీర్‌ఖాన్, వారి అనుచరులూ పంచుకుని మానభంగం చేశారు. తరతరాలుగా మాళ్వ పాలకులు సంపాదించి రహస్య నేలమాళిగలలో దాచిన అంతులేని సంపదను పీర్‌ఖాన్, ఆదంఖాన్‌లు మూటలు కట్టారు.

'రూపమతి లభించింది' అనే వార్త కోసం ఎదురు చూస్తున్న అక్బర్‌కి రూపమతి అగ్నిప్రవేశం చేసిందనే వార్త తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. రూపమతిని సజీవంగా పట్టుకోలేకపోయినందుకు సేనానులను నిందించాడు. ఆదంఖాన్ ఆగడాలను గూఢచారుల ద్వారా విన్న అక్బర్ స్వయంగా వెంటనే మాళ్వకు బయలుదేరాడు.

అక్బర్ చక్రవర్తే స్వయంగా మాళ్వ వస్తున్నాడనే వార్తను ఆదంఖాన్ మొదట నమ్మలేదు. పీకలిండా మద్యం సేవించి పట్టుబడ్డ మాళ్వ అందగత్తెలను అనుభవించడంలో తలమునకలైవున్న ఆదంఖాన్ వార్తాహరుల వార్తను ఖాతరు చేయలేదు.

తనెవరికి భయపడాలి? అక్బర్ చక్రవర్తికా?

అసలు అక్బర్ ఎవరు? తన తల్లిపాలు తాగి పెరిగిన నిన్న మొన్నటి కుర్రకుంక కాదూ? తను ఆ కుంకకా జడవడం? వస్తేరానీ,అప్పుడే చూద్దాం. తనింత కష్టపడి మాళ్వను గెలిచినందుకు ఈ మాళ్వ సుందరాంగులను అనుభవించే హక్కు తనకిలేదా? రూపమతే దొరికి వుంటే ఆమెను తాను అనుభవించకుండా వదిలిపెట్టేవాడా? చక్రవర్తి ఒకడికేనా లోకంలోని అందగత్తెలను అనుభవించే హక్కు వున్నది? తను అక్బర్ కన్నా ఎందులో తక్కువ? ఈ జీవితం అందగత్తెల్ని అనుభవించడానికి కాకపోతే ఇంకెందుకు?... అబ్బ! ఈ మాళ్వ అందగత్తెలు ఏం సుఖాన్నిస్తున్నారు! ఏం పిర్రలు! ఏం తొడలు! ఎంతెంతలావు దుంగల్లాగ!

** ** **

అక్బర్ కోటలోకి వచ్చేసాడనే వార్త తెలిసేసరికి ఆదంఖాన్ నిర్ఘాంతపోయాడు. అత్యంత వేగంగా పరుగెత్తే అశ్వాల మీదే ఆగ్రా నుండి మాళ్వ చేరడానికి పాతిక రోజులు పడుతుంది. కేవలం పదహారు రోజులలో అక్బర్ ఎలా రాగలిగాడు? ఈ కుర్రకుంక మనిషా పిశాచమా? తన అత్యాచారాలు అక్బర్‌కి తెలువకుండా జాగ్రత్త పడాలి అనుకుంటూ అప్పటి వరకూ బాజ్‌బహదూర్‌కు చెందిన ఇద్దరు నాట్యగత్తెలను శయ్యకు నగ్నంగా కట్టివేసి అనుభవించిన ఆదంఖాన్ వారిని సంహరించడానికి ఖడ్గం తీసాడు. కానీ అంతలోనే ఖడ్గాన్ని వరలో పెట్టాడు. తన మందిరంలో రక్తపు మరకలు కన్పించరాదు.

అకృత్యాలకు ఆనవాళ్ళు దొరకకూడదు అనుకుంటూ తన మొరటు హస్తాలతో ఆ యువతుల మెడలను విరిచేసి లేచాడు. తను దాచిన మణుగులకొద్దీ వెండిబంగారాల్లో అతి విలువైనవి తను దాచుకుని మిగిలినవే అక్బర్‌కి అప్పచెప్పాలి. అసలు అదీ అన్యాయమే. జయించే కష్టం తనదీ-సంపదలూ, అందగత్తెలూ అక్బర్‌కా? కానీ అక్బర్ అంటే తనకెంత అయిష్టమైనా, ఆ కుర్రకుంక మొగల్ చక్రవర్తి కాబట్టి తను ఎదురేగి ఘనస్వాగతం చెప్పక తప్పదు అనుకుంటూ మందిరం నుండి బయటకు వచ్చాడు.



3

కానీ అక్బర్ ఎవరి ఘనస్వాగతాల కోసమూ ఎదురు చూడకుండానే కోటలోకి అడుగుపెడుతూనే సరాసరి రూపమతి వుండే మందిరం చూపమని ఆదేశించాడు.

** ** **

విశాలమూ, అతి మనోహరమైన ఆ మందిరం గొప్ప నాట్యగత్తె మందిరం ఎలా వుండాలో అలాగేవుంది. ఆ నిర్మానుష్య మందిరంలో నాట్యగత్తె నృత్యానికి ఈల వేస్తున్నట్లు గవాక్షంలోంచి చల్లటి గాలి విసురుగా శబ్దిస్తూ వీస్తోంది. నర్తకి హస్త విన్యాసాల్లా సిల్కు తెరలు అలలుఅలలుగా కదులుతున్నాయి. మందిరంలో మధ్యగావున్న నర్తకి ప్రతిమ చేతిలో ఒక దంతపు పేటిక వుంది.

అక్బర్ ఆ చితాభస్మపు పేటిక వంకే చూస్తూ ద్వారం వద్దే నిలబడ్డాడు.

తను రూపమతి పాట వినాలనుకున్నాడు. రూపమతి నృత్యం చూడాలనుకున్నాడు. రూపమతి అందచందాలను అనుభవించాలనుకున్నాడు.

కానీ తనకి దొరికింది రూపమతి చితాభస్మం!

తను హిందుస్తాన్‌ని శాసించే మొగల్ చక్రవర్తే అయినా రూపమతిని ఇక చూడలేడు!

అంతులేని అధికారంవున్నా రూపమతి కోకిల కంఠం వినలేడు! ఆమె గొంతు బూడిద అయింది.

మయూరాల నర్తనాన్ని వెక్కిరించే రూపమతి నృత్యాన్ని తిలకించలేడు! గజ్జెల ఘల్లుఘల్లు ధ్వనులతో హృదయాలను లయ తప్పించే ఆమె పాదాలు బూడిద అయ్యాయి.

పిడికిట ఇమిడే ఆమె నడుమును తను పట్టుకోలేడు! ఆమె తనువు దగ్ధమైంది.

ఆమె అపురూప లావణ్య సోయగాలను తను మనసుదీరా అనుభవించలేడు! ఆమె లావణ్యం పిడికెడు బూడిద అయింది.

ఈ బూడిద రూపమతిదే. కానీ ఈ బూడిద రూపమతి కాదు! ఈ బూడిదను తనెలా అనుభవిస్తాడు. లోకంలో అసంఖ్యాకమైన అందగత్తెలు అక్బర్ కౌగిలి కోసం అంగలారుస్తూంటే ఈ రూపమతి అక్బర్ కౌగిలిని కాదని అగ్నిదేవుడి కౌగిలిని వరించింది!

అపురూపమైన అందగత్తెలను స్వంతం చేసుకుని అనుభవించే తన చక్రవర్తి హక్కును వెక్కిరించిపోయింది! అక్బర్ ముఖం ఆగ్రహంతో ఎర్రబడింది.

తన చితాభస్మాన్ని తన దర్శనం కోసం ఇలా వుంచమని ఎందుకు ఏర్పాటుచేసింది? తన ఇచ్ఛకు వ్యతిరేకంగా రూపమతిని ఎవరూ తాకలేరని చెప్పడానికా? ఎంత అహంకారం!

చక్రవర్తిగా తన హక్కుల్ని ఎవరేనా ధిక్కరిస్తే మరుక్షణం వారి శిరస్సు నేలదొర్లుతుంది! తన చక్రవర్తి హక్కునే కాలరాసిన రూపమతిని తను శిక్షించలేడా?

తను పాదుషా అయ్యుండీ ఆమెను సజీవంగా ఎటూ తన శయ్యా మందిరం చేర్చుకోలేకపోయాడు. నిర్జీవమైతేనేం, ఇపుడు పిడికెడు బూడిద రూపంలో భస్మపేటికలో వున్న రూపమతిని తన శయ్యా మందిరం చేర్చి తన చక్రవర్తి హక్కుని సార్థకం చేసుకుంటాడు!

అక్బర్ సేవకుడ్ని పిలిచి ఆ చితాభస్మపు పేటికను ఆగ్రా తరలించమని ఆదేశించాడు.

ఆ సేవకుడు భస్మ పేటికను అందుకోబోతూన్న తరుణంలో గవాక్షంలోంచి బలంగా వీచిన గాలికి ఆ పేటిక కిందపడుతూ బూడిద గాలికెగిరి చక్రవర్తి చెంపను విసురుగా తాకింది!

# క్రియా నామవాచకాలు

దగ్గు తరువాత దగ్గు అయింది. అయితే దగ్గుత్తిక అన్న సమాసంలో మాత్రం దగ్గు మారకుండా అలాగే ఉం ది. గద్గదస్వరం అని అర్థం. క్రియగానూ నామవాచకంగానూ కూడా ఒకే అర్థం. ప్రాచీన కాలంలో డకారంతో మొదలయ్యే పదాలు చాలావరకు దకారాదులుగా మారాయి. ఇటువంటిదే డెప్పు. ఇది దెప్పుగా మారింది. ఈ మాటకు ఎత్తి పొడుచు అని అర్థం. క్రియగానూ నామవాచకంగానూ కూడా అదే అర్థం. డోకు అన్నమాట కూడా గడ్డి చెక్కడం అన్న అర్థంలో దోకుగా మారింది. కాని కక్కు అన్న అర్థంలో డోకుగానే ఉంది. క్రియగానూ నామవాచకంగానూ కూడా ఈ అర్థంలో ఈ మాటకు వాడుక ఉంది.

తక్కు అంటే విడుచు, మాను అని అర్థం. నామవాచకంగా దీనికి మిగులు అని అర్థం. విశేషణంగా ఇతరం అని అర్థం. తగులు అంటే తాకు, స్పృశించు అని అర్థం. దీనికి తవులు అన్న రూపాంతరం కూడా ఉంది. దీనికి ఇష్టపడు, వలచు అనికూడా అర్థం ఉంది. జ్వరం తగలడం, తిట్లు తగలడం, తగులుకోవడం వంటి ప్రయోగాలలో విశేషార్థాలున్నాయి. 'తోవలో ఒక మనిషి తగిలాడు' అన్నప్పుడు ఎదురయ్యాడు, కలిశాడు అని అర్థం. నామవాచకంగా 'తగులు'కు అభిలాష, వలపు. సంబంధం, చిక్కు, నష్టం అని అర్థాలు.

మనభాష - 32



డి.చంద్రశేఖరరెడ్డి

'తగ్గు' అంటే తక్కువగు, కుంగు, వెనుదీయు, కృశించు అని అర్థాలు. నామవాచకంగా తక్కువ అని అర్థం. 'తట్టు' అంటే చేతితో మెల్లగా కొట్టు, స్ఫురించు అని అర్థాలు. ప్రాచీన కావ్యాలలో వాయించు, తోమువంటి అర్థాలు కూడా ఉన్నాయి. నామవాచకంగా దద్దురు, పొంగు అని అర్థం. 'తన్ను'కు క్రియగానూ, నామవాచకంగానూ అర్థభేదం లేదు. 'తప్పు' అంటే తొలగు, వ్యర్థమగు, అసత్యమగు, చెడు, ఉల్లంఘించు, విఫలమగు, తప్పించుకొను, కోల్పోవు అని అర్థాలు. నామవాచకంగా నేరం, పాపం, అబద్ధం, వైఫల్యం అని అర్థాలు. దయ తప్పడం, రైలు తప్పిపోవడం, నెల తప్పడం వంటి విశేషార్థాలు ఉన్నాయి. తప్పదు అంటే కాకమానదు అని అర్థం. తప్పనిసరి అని అర్థం. 'తరటు' అంటే కొరడాతో కొట్టు అనీ, కొరడా అనీ అర్థం. 'తరుగు' అంటే క్రియగాను, నామవాచకంగాను అర్థం ఒకటే. 'తలకు' అంటే భయపడు, జంకు, చలించు అని అర్థాలు. నామవాచకంగా భయం, చలనం, సందేహం, దుఃఖం అని అర్థాలు. తసుకు అంటే ప్రేమ కలిగినట్లు నటించు అని అర్థం. నామవాచకంగా అసత్యం, టక్కు, మోసం అని అర్థం. 'తాకు' అంటే రాచుకొను, తగులు, కొట్టు, మార్కొను అని అర్థాలు. నామవాచకంగా దెబ్బ, పీడ అని అర్థాలు. 'తిట్టు'కు క్రియగానూ, నామవాచకంగానూ నిందించు అని అర్థం. కావ్యాలలో శాపం అనికూడా అర్థం ఉంది. 'తిమురు' అంటే తొందరపడు, ఉద్రేకించు, గర్వించు అని అర్థం. నామవాచకంగా తొందర, గర్వం, తిమ్మిరి అని అర్థాలు. 'తుమ్ము'కు క్రియగానూ, నామవాచకంగానూ అర్థం ఒకటే. 'తురుము' అంటే కొప్పులో పూవులు మొదలయినవి చెరువుకోవడం, జుట్టు ముడివేయడం, సవరించడం, అదిమి దోపడం అని అర్థాలు. నామవాచకంగా కొప్పు, జుట్టు ముడి అని అర్థం.

'తూగు' అంటే బరువు తూగడమనీ, సమానమగు అనీ, సిద్ధమగుఅనీ, చలించు, ఊగు అనీ కూరుకుపడు అనీ అర్థాలు. శక్తి కలిగినంత అనికూడా అర్థం. నామవాచకంగా కునికిపాటు అని అర్థం. 'కవిత్వంలో ఒక తూగు ఉండాలి' వంటి ప్రయోగాలలో సమత్వం అని అర్థం. 'తొణకు' అంటే క్రియగా చిందు అని అర్థం. నామవాచకంగా భయం అనీ, తొట్రుపాటు అనీ అర్థం. 'తొరగు' అంటే విడుచు, కారు అని అర్థం. నామవాచకంగా కూడా అర్థంలో మార్పులేదు. 'తొలకు' అంటే పొర్లు, చిందు, కదులు, వ్యాపించు అని అర్థాలు. నామవాచకంగా చలనం అనీ, అల అనీ అర్థాలు.

త్రుళ్లు / తుళ్లు అంటే సంతోషంతో గంతులు వేయు, ఎగిరిపడు, సంతోషించు, గర్వించు అని అర్థాలు. నామవాచకంగా ఎగసిపాటు అని అర్థం. త్రొక్కు / తొక్కు అడుగుపెట్టు, కాలితో అదుము, దంచు అని అర్థం. నామవాచకంగా కూడా ఇదే అర్థం. తొక్కు అంటే పచ్చడి అనికూడా అర్థం ఉంది. దంచినది కాబట్టి తొక్కు. 'దాటు' అంటే క్రియగానూ, నామవాచకంగానూ దాటడమనే అర్థం.

'దిద్దు' అంటే సరిచేయు, బొట్టు వంటివి పెట్టుకొను అని అర్థం. అక్షరాలు దిద్దు అన్నప్పుడు రాసిన అక్షరంమీద మళ్లీ రాయడం. నామవాచకంగా సరిచేయడమని అర్థం. దుముకు / దూకు అంటే గంతువేయు అని అర్థం. నామవాచకంగా గంతు అని అర్థం. 'దూరు' అంటే నిందించు, నింద అని అర్థం. 'నట్టు' అంటే అడ్డు, ఆలస్యం. 'నడుకు' అంటే చలించు, ఒదుగు, జంకు, ఇక్కట్లు పడు, నశించు అని అర్థం. నామవాచకంగా కంపం, భయం అని అర్థం. 'నరకు' అంటే ఖండించు. నామవాచకంగా దీనికి కత్తిదెబ్బ అని అర్థం. 'నవ్వు'కు క్రియగానూ, నామవాచకంగానూ అర్థం ఒకటే. 'నసుగు' అంటే అస్పష్టంగా మాట్లాడు అని అర్థం. నామవాచకంగా అస్పష్టమైన మాట. 'నాటు' అంటే గుచ్చు, పాతు, తగులు అని అర్థం. నామవాచకంగా దెబ్బ, రంధ్రం, కుదురు, వరి మొదలయినవి నాటటం అని అర్థం. 'నిండు' అంటే పూర్ణమగు, ముగియు అని అర్థం. నామవాచకంగా పూర్ణత్వం. 'నింపు'కు పూరించు, వ్యాపింపజేయు అని అర్థం. నామవాచకంగా ఈ మాటకు పూర్ణం, అధికం అనే అర్థంతోపాటు మనోహరం అనే అర్థం కూడా ఉంది.

'నిక్కు' అంటే పైకి లేచు. పర్థిల్లు, ఉబుకు, సాగు, వ్యాపించు. పుట్టు, సంతోషించు, గర్వించు అని అర్థాలు. నామవాచకంగా ఔన్నత్యం, బింకం, అందం అని అర్థాలు. 'నుగ్గు' అంటే క్రియాపదంగా నలుగు అని అర్థం. అయితే క్రియగా దీనికి ప్రయోగం తక్కువ. నామవాచకంగా పొడి అని అర్థం. 'నుచ్చు' అంటే మేకల పొదుగులకు చుట్టూ గుడ్డ కట్టడం. ఆ కట్టిన గుడ్డకు కూడా 'నుచ్చు' అనే పేరు. 'నుడుగు' అంటే వంచించు, మాట్లాడు అని అర్థం. నామవాచకంగా మాట, పలుకు అని అర్థం.

'నురుము' అంటే పొడిచేయు, చంపు అని అర్థం. నామవాచకంగా పొడి అని అర్థం. 'నెట్టు' అంటే గెంటు, తోయు, నిరాకరించు అని అర్థం. నామవాచకంగా గెంటు, తోపు, తావు అని అర్థం. 'నొక్కు' అంటే అదుము, నలుపు అని అర్థం. అదమడం వల్ల కలిగిన ముడతకు, గుంతకు 'నొక్కు' అని పేరు. 'నొగులు' అంటే బాధచెందు, వాడిపోవు, నలుగు, వికలమగు అని అర్థం. నామవాచకంగా దీనికి నొప్పి, బాధ అని అర్థం. 'నొడుగు / నొడువు' అన్నమాట నుడుగు / నుడువుకు రూపాంతరం. వంచించు, చెప్పు, రచించు, చదువు, స్తుతించు అని అర్థం. నామవాచకంగా మాట, పలుకు అని అర్థం. 'నోము' అంటే నోచు, వ్రతాదులను ఆచరించు, పూజించు అని అర్థం. నామవాచకంగా వ్రతం అనీ, వ్రతఫలం అనీ అర్థాలు.